ప్రభువైన యేసుక్రీస్తు అతి త్వరలో భూమికి తిరిగి రానై ఉన్నాడు. 2000 సంవత్సరముల క్రితం యేసు ఈ భూమిపై జీవించిన కాలములో ఇచ్చిన వాగ్దానము ఇది (యోహాను 14:1-3). మనము ఏ విధముగా ప్రభువు తిరిగి రానై ఉన్నాడు అని ధృవీకరించుకొనుట? ప్రభువు యేసుచేత క్రింద చెప్పబడిన ప్రవచనములు శ్రద్ధతో చదివి, భూమికి చివరి దినములలో సంభవించు విషయములను గమనించి తెలుసుకొందము. మనము అతి జాగ్రత్తగా లేఖనములు చదివి, వాటిలో చెప్పబడిన సంఘటనలు ఇప్పుడు మనం ఉన్న ప్రపంచ పరిస్థితులకు అనుకరించి చూచినట్లైయితే, కచ్చితముగా ప్రభువు రాకడ మనం జీవించుచున్న ఈ కాలములోనే సంభవించునని ధృవీకరింతుము.

## 1 ఆలయము పడద్రోయబడుట

యేసు దేవాలయము నుండి బయలుదేరి వెళ్లుచుండగా ఆయన శిష్యులు ఆ దేవాలయపు కట్టడములు ఆయనకు చూపింపవచ్చిరి. అందుకాయన - మీరు ఇవన్నియు చూచుచున్నారు గదా; రాతి మీద రాయి యొకటియైనను ఇక్కడ నిలిచియుండకుండ పడద్రోయబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నానని వారితో అనెను (మత్తయి 24:1-2, మార్కు 13:1-2, లూకా 21:5-6).**ఇది ఉన్నదున్నట్లుగా క్రీ.శ.70లో నెరవేరెను.**

## 2 రాకడ సూచనలు

ఆయన దేవాలయము ఎదుట ఒలీవల కొండమీద కూర్చుండియుండగా,పేతురు యాకోబు యోహాను అంద్రెయ అనువారు ఆయనను చూచి - ఇవి ఎప్పుడు జరుగును? నీ రాకడకును ఈ యుగసమాప్తికిని సూచనలేవి? మాతో చెప్పుమనగా (మత్తయి 24:3, మార్కు 13:3-4, లూకా 21:7).

## 3 వంచకులు అనేకులు వచ్చెదరు

యేసు వారితో ఇట్లనెను - ఎవడును మిమ్మును మోసపరచకుండ చూచుకొనుడి. అనేకులు నా పేరట వచ్చి - నేనే క్రీస్తునని చెప్పి పలువురిని మోసపరచెదరు. కాలము సమీపించెననియు చెప్పుదురు; మీరు వారి వెంబడి పోకుడి. (మత్తయి 24:4-5, మార్కు 13:5-6, లూకా 21:8).

## 4 యుద్ధాలు, యుద్ధవదంతులు

మరియు మీరు యుద్ధములను గూర్చియు యుద్ధ సమాచారములను గూర్చియు వినబోదురు; మీరు కలవరపడకుండ చూచుకొనుడి. ఇవి జరుగవలసియున్నవి గాని అంతము వెంటనే రాదు (మత్తయి 24:6, మార్కు 13:7, లూకా 21:9).

## 5 జాతిపరమైన యుద్ధాలు | భూకంపాలు | కరవులు | వ్యాధులు

మరియు ఆయన వారితో ఇట్లనెను - జనముమీదికి జనమును రాజ్యముమీదికి రాజ్యమును లేచును; అక్కడక్కడ గొప్ప భూకంపములు కలుగును, తెగుళ్లును కరవులును తటస్థించును, ఆకాశమునుండి మహా భయోత్పాతములును గొప్ప సూచనలును పుట్టును (మత్తయి 24:7, మార్కు 13:8,లూకా 21:10-11).

## 6

ఇవన్నియు వేదనలకు ప్రారంభము (మత్తయి 24:8, మార్కు 13:8).

## 7 క్రైస్తవులను హింసించడము

మిమ్మునుగూర్చి మీరే జాగ్రత్తపడుడి. ఇవన్నియు జరుగక మునుపు వారు మిమ్మును బలాత్కారముగా పట్టి, నా నామము నిమిత్తము మిమ్మును రాజులయొద్దకును అధిపతులయొద్దకును తీసికొనిపోయి,సమాజమందిరములకును చెరసాలలకును అప్పగించి హింసింతురు. ఇది సాక్ష్యార్థమై మీకు సంభవించును. (మత్తయి 24:9, మార్కు 13:9, లూకా 21:12-13).

## 8

వారు మిమ్మును అప్పగించుటకు కొనిపోవునప్పుడు మీరు-ఏమి చెప్పుదుమా అని ముందుగా చింతింపకుడి, ఆ గడియలోనే మీకేది ఇయ్యబడునో అదే చెప్పుడి; చెప్పువాడు పరిశుద్ధాత్మయే గాని మీరు కారు. మీ విరోధులందరు ఎదురాడుటకును, కాదనుటకును వీలుకాని వాక్కును జ్ఞానమును నేను మీకు అనుగ్రహింతును. (మార్కు 13:11, లూకా 21:14-15).

## 9 కుటుంబములో నమ్మకద్రోహం

సహోదరుడు సహోదరుని, తండ్రి కుమారుని, మరణమున కప్పగింతురు; కుమారులు తలిదండ్రులమీద లేచి వారిని చంపింతురు; నా నామము నిమిత్తము అందరిచేత మీరు ద్వేషింపబడుదురు. గాని మీ తల వెండ్రుకలలో ఒకటైనను నశింపదు. మీరు మీ ఓర్పు చేత మీ ప్రాణములను దక్కించుకొందురు. (మత్తయి 24:9-10, మార్కు 13:12-13, లూకా 21:16-19).

## 10 ప్రేమ చల్లారును

అక్రమము విస్తరించుటచేత అనేకుల ప్రేమ చల్లారును. అంతము వరకు సహించినవాడెవడో వాడే రక్షింపబడును. (మత్తయి 24:12-13).

## 11

మరియు **ఈ రాజ్య సువార్త** సకల జనములకు సాక్ష్యార్థమై లోకమందంతటను ప్రకటింపబడును; **అటుతరువాత** అంతము వచ్చును. (మత్తయి 24:14, మార్కు 13:10).

## 12 యెరూషలేములో అసహ్యకరమైన హేయవస్తువు.

యెరూషలేము దండ్లచేత చుట్టబడుట మీరు చూచునప్పుడు దాని నాశనము సమీపమైయున్నదని తెలిసికొనుడి (లూకా 21:20). కాబట్టి ప్రవక్తయైన దానియేలుద్వారా చెప్పబడిన నాశనకరమైన హేయవస్తువు పరిశుద్ధస్థలమందు నిలుచుట మీరు చూడగానే - చదువువాడు గ్రహించుగాక-యూదయలో ఉండువారు కొండలకు పారిపోవలెను; దాని మధ్యనుండువారు వెలుపలికి పోవలెను; పల్లెటూళ్లలోని వారు దానిలో ప్రవేశింపకూడదు, మిద్దెమీద ఉండువాడు తన యింటిలో నుండి ఏదైనను తీసికొని పోవుటకు దిగకూడదు; పొలములో ఉండువాడు, తన బట్టలుతీసికొని పోవుటకు ఇంటికి రాకూడదు (మత్తయి24:15-18, మార్కు 13:14-16, లూకా 17:31,21:21) అయ్యో, ఆ దినములలో గర్భిణులకును పాలిచ్చువారికిని శ్రమ. అప్పుడు మహా శ్రమ కలుగును గనుక మీరు పారిపోవుట చలికాలమందైనను విశ్రాంతిదినమందైనను సంభవింపకుండవలెనని ప్రార్థించుడి. (మత్తయి 24:19-20, మార్కు 13:17-18, లూకా 21:23). వారు కత్తివాత కూలుదురు; చెరపట్ట బడినవారై సమస్తమైన అన్యజనముల మధ్యకు పోవుదురు; అన్యజనముల కాలములు సంపూర్ణమగువరకు యెరూషలేము అన్యజనముల చేత త్రొక్కబడును (లూకా 21:24).

## 13 యాకోబు సంతతివారికి ఆపద దినము (యిర్మీయా 30:6-7)

అయ్యో, యెంత భయంకరమైన దినము! అట్టి దినము మరియొకటి రాదు; అది యాకోబు సంతతివారికి ఆపద తెచ్చుదినము; అయినను వారు దానిలో పడకుండ రక్షింపబడుదురు, అవి శ్రమగల దినములు; దేవుడు సృజించిన సృష్ట్యాది నుండి ఇదివరకు అంత శ్రమ కలుగలేదు, ఇక ఎన్నడును కలుగబోదు. ప్రభువు ఆ దినములను తక్కువచేయనియెడల ఏ శరీరియు తప్పించుకొనక పోవును; ఏర్పరచబడిన వారి నిమిత్తము, అనగా తాను ఏర్పరచుకొనిన వారినిమిత్తము ఆయన ఆ దినములను తక్కువ చేసెను (మత్తయి 24:21-22;మార్కు 13:19-20; లూకా 21:23). లేఖనములలో వ్రాయబడిన వన్నియు నెరవేరుటకై అవి ప్రతి దండన దినములు (లూకా 21:22).

## 14 అబద్ధ క్రీస్తులు, అబద్ధ ప్రవక్తలు

ఆ కాలమందు ఎవడైన - ఇదిగో క్రీస్తు ఇక్కడ ఉన్నాడు, అక్కడ ఉన్నాడు అని చెప్పిన యెడల నమ్మకుడి. అబద్ధపు క్రీస్తులును అబద్ధపు ప్రవక్తలును వచ్చి, సాధ్యమైతే ఏర్పరచబడిన వారిని సహితము మోసపరచుటకై గొప్ప సూచక క్రియలను మహాత్కార్యములను కనబరచెదరు. మీరు జాగ్రత్తగా ఉండుడి. ఇదిగో సమస్తమును మీతో ముందుగా చెప్పియున్నాను (మత్తయి 24:23-24; మార్కు 13:21-23). మెరుపు తూర్పున పుట్టి పడమటి వరకు ఏలాగు కనబడునో ఆలాగే మనుష్యకుమారుని రాకడయు నుండును (మత్తయి 24:26-27; లూకా 17:23-24).

## 15 ఆకాశములో సూచనలు

ఆ దినముల శ్రమ ముగిసిన వెంటనే చీకటి సూర్యుని కమ్మును, చంద్రుడు కాంతిని ఇయ్యడు, ఆకాశము నుండి నక్షత్రములు రాలును, భూమి మీద సముద్ర తరంగముల ఘోషవలన కలవరపడిన జనములకు శ్రమయు కలుగును.





ఆకాశమందలి శక్తులు కదలింపబడును (మత్తయి 24:29; మార్కు 13:24-25లూకా 21:25). గనుక లోకము మీదకి రాబోవుచున్న వాటి విషయమై భయము కలిగి, మనుష్యులు ఎదురుచూచుచు ధైర్యముచెడి కూలుదురు (లూకా 21:25-26).

16 అప్పుడు **మనుష్యకుమారుని సూచన** ఆకాశమందు కనబడును. అప్పుడు మనుష్యకుమారుడు ప్రభావముతోను మహా మహిమతోను ఆకాశ మేఘారూఢుడై వచ్చుట చూచి, భూమి మీదనున్న సకల గోత్రముల వారు రొమ్ము కొట్టుకొందురు. మరియు ఆయన గొప్ప బూరతో తన దూతలను పంపును. వారు ఆకాశము యొక్క ఈ చివరనుండి ఆ చివర వరకు నలుదిక్కుల నుండి ఆయన ఏర్పరచుకొనిన వారిని పోగుచేతురు (మత్తయి 24:30-31; మార్కు 13:26-27; లూకా 21:27).

17 ఇవి జరుగ నారంభించినప్పుడు మీరు ధైర్యము తెచ్చుకొని మీ తలలెత్తికొనుడి, మీ విడుదల సమీపించుచున్నదనెను. (లూకా 21:28).

18 అంజూరపు చెట్టును చూచి ఒక ఉపమానము నేర్చుకొనుడి, అంజూరపుకొమ్మ లేతదై చిగిరించునప్పుడు వసంత కాలము యింక సమాపముగా ఉన్నదని మీకు తెలియును. ఆ ప్రకారమే **మీరీ సంగతులన్నియు జరుగుట చూచునప్పుడు దేవుని రాజ్యము సమీపమాయెనని,** ఆయన సమీపముననే ద్వారముదగ్గరనే యున్నాడని తెలిసికొనుడి. (మత్తయి 24:32-33; మార్కు 13:28-29; లూకా 21:29-31). అయితే ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి తప్ప ఏ మనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు (మత్తయి 24:36 మార్కు 13:32).

19 **నోవహు దినములు**
ఏలాంగుడెనో మనుష్యకుమారుని రాకడయును అలాగే ఉండును. జలప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్ళిన దినము వరకు, వారు తినుచు, త్రాగుచు, పెండ్లి చేసికొనుచు, పెండ్లికిచ్చుచునుండి - జలప్రళయము వచ్చి అందరిని కొట్టుకొనిపోవు వరకు ఎరుగక పోయిరి. ఆలాగుననే మనుష్యకుమారుని రాకడ ఉండును (మత్తయి 24:37-39; లూకా 17:26-27).

ఏంజిల్ టీవి చూడండి
www.angeltv.org

20 **లోతు దినములలో**
జరిగినట్టును జరుగును. జనులు తినుచు, త్రాగుచు, కొనుచు, అమ్ముచు, నారు నాటుచు, ఇండ్లు కట్టుచు నుండిరి. అయితే లోతు సొదొమ విడిచిపోయిన దినమున ఆకాశము నుండి అగ్ని గంధకములు కురిసి వారినందరిని నాశనము చేసెను. ఆ ప్రకారమే మనుష్యకుమారుడు ప్రత్యక్షమగు దినమున జరుగును (లూకా 17:28-30).

21 లోతు భార్యను జ్ఞాపకము చేసికొనుడి. తన ప్రాణమును రక్షించుకొనగోరువాడు దానిని పోగొట్టుకొనును, దాని పోగొట్టుకొనువాడు దానిని సజీవముగా కాపాడుకొనును (లూకా 17:32-33).

22 ఆ రాత్రి యిద్దరొక్క మంచము మీద ఉందురు; వారిలో ఒకరు కొనిపోబడును ఒకరు విడిచి పెట్టబడును. ఇద్దరు స్త్రీలు ఒక్క తిరుగలి విసరుచుందురు; ఒకతె కొనిపోబడును ఒకతె విడిచిపెట్టబడును. ఆ కాలమున ఇద్దరు పొలములో ఉందురు, ఒకడు తీసుకొనిపోబడును ఒకడు విడిచిపెట్టబడును (మత్తయి 24:40-41; లూకా 17:34-36). శిష్యులు - ప్రభువా, యిది ఎక్కడ జరుగునని ఆయన నడిగినందుకు ఆయన - పీనుగు ఎక్కడ ఉన్నదో అక్కడ గద్దలును పోగవునని వారితో చెప్పెను (మత్తయి 24:28; లూకా 17:37).

23 **మెలకువతో ఉండి ప్రార్థన చేయుడి**
ఒక మనుష్యుడు తన దాసులకు అధికారమిచ్చి, ప్రతి వానికి వాని వాని పని నియమించి- మెలకువగా నుండు మని ద్వారపాలకునికి ఆజ్ఞాపించి, యిల్లు విడిచి దేశాంతరము పోయినట్టే ఆ కాలము ఉండును. ఇంటి యజమానుడు ప్రొద్దుగ్రుంకి వచ్చునో, తెల్లవారునప్పుడు వచ్చునో, యెప్పుడు వచ్చునో మీకు తెలియదు. ఆయన అకస్మాత్తుగా వచ్చి మీరు నిద్రబోవుచుండుట చూచునేమో గనుక మీరు మెలకువగా నుండుడి (మార్కు 13:34-36).

24 ఏ జామున దొంగవచ్చునో ఇంటి యజమానునికి తెలిసియుండినయెడల అతడు మెలకువగా ఉండి తన యింటికి కన్నము వేయనియ్యడని మీరెరుగుదురు. మీరనుకొనని గడియలోమనుష్య కుమారుడు వచ్చును గనుకనే మీరును సిద్ధముగా ఉండుడి (మత్తయి 24:43-44)

Local Contact Address

25 మీ హృదయములు ఒకవేళ తిండివలనను, మత్తువలనను, ఐహిక విచారములవలనను, మందముగా ఉన్నందున ఆ దినము అకస్మాత్తుగా మీ మీదికి ఉరివచ్చినట్టు రాకుండ మీ విషయమై మీరు జాగ్రత్తగా ఉండుడి. మెలకువగా నుండి ప్రార్థన చేయుడి. ఆ దినము భూమియందంతట నివసించు వారందరి మీదకి అకస్మాత్తుగా వచ్చును (మార్కు 13:33; లూకా 21:34-35).

26 కాబట్టి మీరు జరుగబోవు వీటి నెల్లను తప్పించుకొని, మనుష్యకుమారుని యెదుట నిలువబడుటకు శక్తిగలవారగునట్లు ఎల్లప్పుడు ప్రార్థన చేయుచు మెలకువగా ఉండుడని చెప్పెను (లూకా 21:36).

27 ఇవన్నియు జరుగు వరకు ఈ తరము గతింపదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను. ఆకాశమును భూమియు గతించును గాని నా మాటలు ఏమాత్రమును గతింపవు. (మత్తయి 21:34-35; మార్కు 13:30-31; లూకా 21:32-33)

**మహిమగల తన సింహాసనము మీద ఆసీనుడై ఉన్న మహారాజు - ప్రభువైన యేసుక్రీస్తు మహా ప్రభావముతోను మహిమతోను తన సమస్త దూతలతోను పరిశుద్ధులందరితోను అతి త్వరలో తిరిగిరానై ఉన్నాడు**

మీరు దేవునికి భయపడి ఆయనను మహిమపరచుడి; ఆయన తీర్పు తీర్చు గడియ వచ్చెను గనుక ఆకాశమును భూమిని సముద్రమును జలధారలను కలుగజేసినవానికే నమస్కారము చేయుడి (ప్రకటన 14:7).

## సమయం ఇక ఆలస్యం కాదు!

ఇప్పుడు దేవుని పరలోక రాజ్యం మనకి అతి దగ్గరగా ఉంది. మారుమనస్సు పొంది దేవుని సువార్త యందు విశ్వాసం ఉంచండి.

మీ దేవుడైన ప్రభువుని కలుసుకొనుటకు సిద్ధముగా ఉండుడి.



# దేవుని రాజ్య సువార్త

తెలుగు | TELUGU